క్లుప్తంగా

పలమనేరులో కంట్రోల్‌రూమ్

పలమనేరు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావం పలమనేరు ప్రాంతంలోనూ ఉంటుందన్న హెచ్చరికతో స్థానిక ప్రజలకు ఏర్పడే సమస్యలపై కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఇన్బనాథన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులందరూ అందుబాటులో ఉంటున్నామని పేర్కొన్నారు. అలాగే పలమనేరు మున్సిపల్ కార్యాలయంలోనూ తుపాను సాయం కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ప్రజలు ఏదేనీ సాయం కోసం 08579–252217 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రకటనలో సూచించారు.

ఆగిన పాఠశాల భవన నిర్మాణాలు


కొటాలూరులో ఆగిన నిర్మాణ పనులు

కుప్పంరూరల్: మండల పరిధిలోని కొటాలూరు పాఠశాల భవన నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించినా సకాలంలో కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో చదువులు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా పాఠశాల భవనాలను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సభ్యుడిగా మున్నా



పుంగనూరు: పట్టణానికి చెందిన ఏఐఎస్‌ఎఫ్ సీనియర్ నాయకుడు మున్నాను రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా సమితి ప్రతిపాదనల మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో మున్నాను రాష్ట్ర సభ్యుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మున్నా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తామని, విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు.

అఖండ హరి నామస్మరణం


ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా హరినామ స్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామి వారి నామస్మరణతో మారుమోగింది. భజన కార్యక్రమంలో ప్రజలు, పట్టణ ప్రముఖల ఆధ్వర్యంలో గత 10 ఏళ్లుగా కొనసాగుతోందని వారు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కథలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి


చిలకముక్కు చిన్నోడు పుస్తకావిష్కరణ

పలమనేరు: కథలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయని పలమనేరు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు అన్నారు. పట్టణ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో డా.హరికిషన్ రచించిన చిలకముక్కు చిన్నోడు పుస్తకావిష్కరణ శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పిల్లలు కథలను చదవాలనే తలంపుతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండే పిల్లల పుస్తకంగా ఇది ఉందన్నారు. విలువలతో కూడిన జీవితానికి కథలు దోహదం చేస్తాయని గంగవరం సీఐ భాస్కర్ తెలిపారు. రచయిత ఎన్నో ఏళ్లుగా అధ్యయనం చేసి చిన్నపిల్లలకు ఆసక్తిని కలిగించే రీతిలో ఈ పుస్తకాన్ని రాశారని మరో రచయిత పలమనేరు బాలాజీ తెలిపారు. తెలుగు భాషకు నిరంతరం సేవ చేస్తున్న తులసీనాథం నాయుడికి తన పుస్తకాన్ని అంకితమిస్తున్నానని పుస్తక రచయిత డా.హరికిషన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన్ను స్థానిక భాషాభిమానులు, సాహిత్య అభిమానులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి, ఆనందబాబు, వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రశాంతి, సంస్థ కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

వినియోగంలోకి తీసుకురండి సారూ!


శిథిలమవుతున్న వాహనం

కుప్పంరూరల్: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జీపు తుప్పు పట్టి నిరుపయోగంగా మారడంతో జీపును మూలన పడేశారు. సంవత్సరం నుంచి వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ శిథిలమైంది. వాహనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు చెబుతున్నారు.

ఒబ్బిడి చేసిన వరి ధాన్యం


బస్తాల్లో నింపిన వరి ధాన్యం


వర్షానికి నానుతున్న వరి గడ్డి


కలవరింత!

- ఫెంగల్ తుపానుతో ఒబ్బిళ్లకు తప్పని ఇబ్బందులు
- ఒబ్బిడి చేసిన వరిని ఆరబెట్టుకోలేని అన్నదాతలు
- అమాంతం తగ్గిన ధాన్యం ధరలు
- పలు చోట్ల నేలవాలిన వరి
- పంట పెట్టుబడులూ దక్కనట్టే


నేలవాలిన వరిపంట

పలమనేరు: ఏ పంట సాగు చేసినా నికర లాభాలు లేనందున పలువురు రైతులు వరి పంట సాగుపై మొగ్గు చూపారు. ఆమేరకు పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో ఈ రబీ సీజన్‌కు సంబంధించి 3వేల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 2వేల ఎకరాల దాకా ఇప్పటికే ఒబ్బిళ్లు జరిగాయి. మరో వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఫెంగల్ తుపాను కారణంగా ఈదురు, చలిగాలులతో తేలికపాటి వర్షం కురుస్తోంది. దీంతో కోతలు కోయని వరి నేలవాలుతోంది. ఇప్పటికే ఒబ్బిళ్లు చేసుకున్న ధాన్యాన్ని ఎండబెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం రాసుల్లోనే మొలకెత్తే అవకాశం నెలకొంది. దీనికి తోడు ఇప్పటికే ఆరబెట్టుకున్న ధాన్యాన్ని విక్రయిద్దామంటే ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఈ దఫా వరి రైతులకు నష్టాలు తప్పేలా లేవు.

ధాన్యం ధరలు అమాంతం పతనం

మొన్నటి దాకా క్వింటాల్ ధాన్యం సన్నరకం ధర రూ.3వేలుగా ఉండేది. ఇతర రకాలు రూ.2,700 పలికాయి. కానీ గత నెల రోజులుగా ధాన్యం సీజన్ మొదలు కావడంతో ధాన్యం ధర క్వింటాల్ రూ.2,500కు పడిపోయింది. ఇప్పటికే వరి ఒబ్బిళ్లు చేసిన రైతులు ధాన్యాన్ని ఎండబెట్టుకోవాలంటే ఎండ లేదు. తుపాను కారణంగా రాసుల్లోనే వరి ఉంది. తుపాను ఇలాగే మరికొన్నాళ్లుంటే అవి మొలకెత్తడం లేదా మగ్గిపోయి నాణ్యత తగ్గడం ఖాయం. దీంతో ఈ ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ఆసక్తిని చూపని పరిస్థితి నెలకొంది.

వరి ఒబ్బిళ్లకు ఫెంగల్ దెబ్బ

కోతకు సిద్ధమైన వరి ఒబ్బిళ్లకు తుపాను కారణంగా ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికే వాముల్లో ఉన్న వరిపంట సైతం మొలకలు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎలా వరిని ఒబ్బిడి చేసుకోవాలో రైతులకు దిక్కుతోచడం లేదు. ఇంతవరకు వరి కోతలు లేక చేలల్లో ఉన్న వరి మడులు సైతం ఈదురు గాలులకు నేలకొరిగాయి. ఇవి కూడా చేలల్లోనే మొలకెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. ఆరుగాలం పంట చేసి ఆఖరుకు పంట చేతికొచ్చే తరుణంలో ఇలా పంట తుపాను పాలు కావడం వరి రైతులకు మనోబాధను పెడుతోంది.

పెట్టుబడులైనా దక్కేనా...

వరి పంట ఎకరాలో సాగు చేసేందుకు రైతులకు రూ.25వేలు ఖర్చు అవుతోంది. ఆపై పంట ఒబ్బిడికి మరో పదివేలు కావాల్సిందే. ఆమేరకు ఎకరా వరి పంటకు రూ.35వేల పెట్టుబడి ఉండాలి. ఎకరానికి సగటున 20 బస్తాలు పండినా ఇప్పుడున్న ధర మేరకు రూ.2,500 ధర ఉంటే రూ.50 వేలు, ధాన్యం క్వాలిటీ తగ్గినట్లయితే రూ.2వేలతో రూ.40 వేలు మాత్రమే వస్తోంది. దీంతో పంట పెట్టుబడి రైతు కుటుంబం కష్టం లెక్కిస్తే వరి రైతులకు మిగిలేదేమీలేనట్టే.

వరిగడ్డి వాన పాలు...

ఎక్కువమంది రైతులు వరిసాగు ఎందుకు చేస్తారంటే ఇంటికి ధాన్యంతోపాటు పశువులకు వరి గడ్డి దక్కుతుందని భావిస్తారు. కానీ ఈ తుపాను కారణంగా వరి ఒబ్బిళ్లు చేసిన పశుగ్రాసం సైతం వానకు పూర్తిగా నాని పశుగ్రాసానికి సైతం పనికి రాకుండా పోతోంది. దీంతో రైతులు నష్టపోయామని చాలా బాధపడుతున్నారు. ఏదేమైనా ఈ దఫా వరి రైతులకు తుపాను కారణంగా వాతావరణం అనుకూలించక, ఉన్నట్టుండి ధరల పతనంతో నష్టాలు తప్పనట్టే.

రైతన్నల గుండెల్లో గుబులు


బైరెడ్డిపల్లె: కోత దశలో వరి పంట

బైరెడ్డిపల్లె: సాగు ఆఖరి దశలో వాతావరణంలో మార్పులతో రైతన్నల గుండెల్లో గుబులు రేపుతోంది. నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫెంగల్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో నాలుగు రోజుల నుంచి ఆకాశం మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందాన ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాను హెచ్చరికలతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో 1,200 ఎకరాల వరిపంటను రైతులు సాగు చేశారు. పలు గ్రామాల్లో ముందుగా నాట్లు వేసిన చోట్ల ఇప్పటికే వరికోతలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి సమయంలో తుపాన్ రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం కురుస్తుండడంతో వరి నేలకొరిగే ప్రమాదం ఉందని, దీంతో ధాన్యం రంగుమారిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేలు పెట్టుబడి పెట్టామని, ఈ సమయంలో వర్షాలు కురుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

స్మార్ట్ లాక్‌తో చోరీలకు చెక్


స్మార్ట్ లాక్ పనితీరును వివరిస్తున్న పోలీసులు

రామకుప్పం: స్మార్ట్ లాక్‌ను ఉపయోగించడం ద్వారా చోరీలను కట్టడి చేయవచ్చని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సీఐ మల్లేష్ యాదవ్, ఎస్‌ఐ వెంకట మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని పలు ఆలయాలు, ప్రార్థనాలయాలకు దాతల సహకారంతో స్మార్ట్ లాక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు స్మార్ట్‌లాక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యాపారులు గోదాములకు స్మార్ట్ లాక్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో అనుమానిత, అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. గంజాయి, సారా తయారీ విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా సహించే ప్రసక్తే లేదని తెలిపారు.

రూ.1,500.. అసత్య ప్రచారం


మాట్లాడుతున్న పోస్టుమాస్టర్ నాగరాజ

పుంగనూరు: పోస్టాఫీసుల్లో ఖాతా ఉంటే రూ.1,500 ఖాతాలో జమ అవుతుందనేది అసత్య ప్రచారమని, దాన్ని ప్రజలెవరూ నమ్మొద్దని పోస్టుమాస్టర్ నాగరాజ వివరణ ఇచ్చారు. ఖాతాలు తెరిచేందుకు పోస్టాఫీసు వద్ద శనివారం జనం క్యూకట్టారు. అధికారులు, సిబ్బంది ఎంత చెప్పినా ప్రజలు వినకుండా ఖాతాలు తెరవాలంటూ పట్టుబట్టడంతో పోస్టాఫీసు వారికి జనం వైఖరి తలనొప్పిగా మారింది. ఈ విషయమై పోస్టుమాస్టర్ నాగరాజ మాట్లాడుతూ ఇలాంటి విషయాలకు పోస్టాఫీసుకు సంబంధం లేదన్నారు. నిబంధనల మేరకు ఏ బ్యాంకులో ఖాతా ఉన్న వారికి ఎన్‌పీసీఐతో లింక్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాల డబ్బులు ఖాతాల్లో జమచేస్తుంటే పోస్టాఫీసులో ఖాతా తెరవాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైతే ఎన్‌పీసీఐ లింక్ లేకుండా ఉంటుందో వారు మాత్రమే పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవాలని కోరారు. ప్రజలు ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని కోరారు.

శివయ్య పుష్కరిణిలో పూజలు


ప్రత్యేక పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరస్వామి

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పుష్కరణిలో శనివారం ఉదయం నుంచి రాత్రి దాక పార్థివలింగ పూజలు, కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శివ లింగాలను ప్రత్యేకమైన మట్టితో చేయించి పూజలు చేశారు. పుష్కరిణి ప్రాంతం శివనామ స్మరణతో భక్తి పారవశ్యమైంది. విశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, పట్టణ ప్రజలు కలసి పార్థివలింగ పూజలు నిర్వహించారు.

పంటల బీమాతో రైతులకు లబ్ధి

గుడుపల్లె: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవాలని ఏఓ నాగరాజు తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా ఇచ్చే ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంట ఎకరాకు రూ.84 చెల్లిస్తే రూ.42 వేలు, వేరుశనగ ఎకరాకు రూ.60 చెల్లిస్తే రూ.30 వేలు, టమాట పంటకు ఎకరాకు రూ.1,250 చెల్లిస్తే రూ.25 వేలు ఇస్తామన్నారు. ఈ నెల 15లోపు వేరుశనగ, టమాట, వరి పంటకు ఈనెల 30లోపు ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

రొంపిచెర్లలో ఎడతెరిపి లేని వర్షం


తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: మండలంలో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు శనివారం మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రొంపిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా కంట్రోల్ రూమ్‌కు:8790925762 సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. వీఆర్‌ఓలు గ్రామాల్లో ఉండి అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. చలితీవ్రత పెరిగింది. ప్రజలందరూ ఇళ్లకే పరిమితం అయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు: మండలంలోని దళితవాడల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. తహసీల్దార్ రాము, ఎంపీడీఓ లీలామాధవి ఆధ్వర్యంలో కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. పలు సమస్యలను సభ్యులు చర్చించారు. కమిటీ సమావేశాలు మొక్కుబడిగా కాకుండా సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరారు.

సైనికులందరికీ ఆస్తి పన్ను మినహాయిస్తాం



మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా, పక్కన కమిషనర్ మధుసూదన్‌రెడ్డి


కౌన్సిలర్ నటరాజ ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి


పుంగనూరు: సైనికులు, మాజీ సైనికులు నివాసం ఉన్న గృహాలకు ఆస్తి పన్ను మినహాయింపు ఇస్తామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించి అజెండాను చర్చించారు. అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్మన్ ప్రకటించారు. చర్చలో కౌన్సిలర్ నటరాజ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చాలా మంది సైనికులు, మాజీ సైనికులు ఉన్నారని, వారిలో కొంత మందికి మాత్రమే పన్ను మినహాయింపు ఇవ్వడం బాధాకరమని చెప్పారు. అధికారులు ఈ విషయంలో సైనికుల సంఘం ద్వారా సమాచారం సేకరించి, సైనికులందరికీ పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు సైనికులు, మాజీ సైనికులు నివాసం ఉన్న కుటుంబాల వారందరికీ పన్ను మినహాయింపు ఇస్తామన్నారు. వారికి చెందిన వ్యాపార సముదాయాలకు, బాడుగ ఇళ్లకు మినహాయింపు లభించదన్నారు. త్యాగరాజు మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, నివారించాలని సూచించారు. హిందూ శ్మశాన వాటికలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కౌన్సిలర్ మనోహర్ మాట్లాడుతూ నక్కబండ ప్రాంతం మున్సిపాలిటీలో చేరిందని, వారికి ఆస్తి పన్ను విధించి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ రామకృష్ణం రాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో అద్దె వాహనాల నివారణను అరికట్టాలని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ నక్కబండలో పన్ను విధిస్తున్నామన్నారు. పారిశుధ్య కార్యక్రమాలకు ఒక నెల కోసం వాహనాలను అద్దెకు తీసుకున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ వాహనాలు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ లలిత, డీఈఈ మహేష్, టీపీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి, హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.


మున్సిపాలిటీలో ప్రొటోకాల్ అమలు



పుంగనూరు మున్సిపల్ ముఖద్వారంలో ఫొటోలు ఏర్పాటు చేసిన చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీలో ప్రొటోకాల్ నిబంధనల మేరకు చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోలు ఏర్పాటు చేశారు. కార్యాలయం ముఖద్వారం వద్ద శనివారం సీఎం, డిప్యూటీ సీఎం, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఫొటోలతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు ఏర్పాటు చేశారు. సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలను ఏర్పాటు చేయడంతో పలువురు మున్సిపల్ పాలక వర్గాన్ని అభినందించారు. వైస్ చైర్మన్ లలిత, కౌన్సిలర్లు త్యాగరాజు, అమ్ము, కిజర్‌ఖాన్, నటరాజ, కాంతమ్మ, గంగులమ్మ, రేష్మ, కమలమ్మ, సాజిదా బేగం, యువకుమారి, భారతి, మమత, ఆదిలక్ష్మి, పద్మావతమ్మ, రాఘవేంద్ర, తుంగా మంజునాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు నివారణే మార్గం







ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ, తీర్థంలో ఆరోగ్యసిబ్బంది అవగాహన ర్యాలీ, చౌడేపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

పలమనేరు: ఎయిడ్స్‌కు మందులేదని, నివారణే ఒక్కటే మార్గమని పలమనేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు అన్నారు. ఆమేరకు స్థానిక కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై సమాజానికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై కూడా ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అంతకుముందు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆర్‌ఆర్‌సీ కోఆర్డినేటర్ జయశంకర్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటేష్‌బాబు, బాలాజీ, అధ్యాపకులు చిదంబరం, బేనజీర్, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లె: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం గ్రామ పురవీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు పద్మావతి, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ లేని సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేసి 2030 నాటికి నిర్మూలించాలని పేర్కొన్నారు. ఎయిడ్స్ బాధితులు ఏఆర్‌టీ సెంటర్ ద్వారా ఉచిత మందులు పొందుతూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటూ జీవించవచ్చునన్నారు. ప్రతిఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎస్ శ్రీదేవి, ఆరోగ్యసిబ్బంది పూర్ణ, రాజారెడ్డి, బేబి, హెచ్‌ఎం రత్నమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గం

చౌడేపల్లె: ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు.. నివారణ ఒక్కటే మార్గమని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శనివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ముందస్తుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలసి అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ అసురక్షిత లైంగిక సంబంధాల వలన ఎక్కువ మందికి ఎయిడ్స్ సోకి అవస్థలు పడుతున్నారన్నారు. 25 ఏళ్లలోపు యువత వారి నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అవగాహన కల్పించారు. వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బాలాజి పాల్గొన్నారు.

కుప్పంలో ఎడతెరిపి లేని వర్షం

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- స్తంభించిన రవాణా వ్యవస్థ
- ఇబ్బంది పడిన విద్యార్థులు


కుప్పంలో కురుస్తున్న వర్షం

కుప్పం: కుప్పంలో ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. శనివారం ఉదయం నుంచి వర్షపు జల్లులు కురుస్తుండడంతో పట్టణంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వర్షం అధికం కావడంతో పట్టణ వీధుల్లో రోడ్లు, మురుగునీటి కాలువలు పొంగి పొర్లాయి. సాయంత్రం కళాశాలలు, పాఠశాల విద్యార్థులు ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఓవైపు వర్షపు జల్లులు, మరోవైపు రోడ్డుపై నీటి ప్రవాహం కారణంగా జనజీవనం స్తంభించింది. పట్టణంలో రోడ్డుపైన చిల్లర దుకాణదారులు, కూరగాయల వ్యాపారులకు వర్షానికి తీరని నష్టం వాటిల్లింది. కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు తుపాన్ నేపథ్యంలో సహాయ సహకారాలు అందించేందుకు ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 9966072234 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ శీతారాం తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆది, సోమ, మంగళవారాల్లో తుపాన్ తీవ్రంగా ఉంటుందన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వర్షం తగ్గే వరకు ఇళ్లలోనే ఉండాలన్నారు. పిడుగులు పడే అవకాశం ఉండడంలో రైతులు చెట్ల కింద కాకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని ఆయన సూచించారు.